

అశ్వవాహనంపై ఆది దంపతులు



అశ్వవాహనంపై విహరిస్తున్న ఆదిదంపతులు

- రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకరణలో భ్రమరాంబికాదేవి
- పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయ శాఖ మంత్రి ఆనం

శ్రీశైలం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన శ్రీశైలం క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. రాత్రి మల్లికార్జునస్వామితో కలసి అమ్మవారు అశ్వవాహనంపై విహరించారు. రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు చుతుర్భుజాలను కలిగిన పాశం, అంకుశం, పద్మం, చెరుకుగడను కలిగి ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం కుమారి పూజ నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు నుంచి పదేళ్లలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు. రాత్రి ఆది దంపతులు అశ్వవాహనంపై విహరిస్తుండగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అక్కమహాదేవి అలంకారం మండపం నుంచి గ్రామోత్సవం కొనసాగింది.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు: దసరా ఉత్సవాల్లో భాగంగా నిత్య కళారాధన వేదిక వద్ద పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన జయప్రదరామమూర్తి బృందం వేణుగానం, ఉమా శ్రీరామ్ బృందం భక్తిరంజని, రాయచోటికి చెందిన కె.ప్రమీల హరికథా కాలక్షేపం ఆకట్టుకున్నాయి.


పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


గ్రామోత్సవంలో అధికారులు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టు వస్త్రాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. మంత్రి వెంట శ్రీశైలం పాలకమండలి చైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్, ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారన్నారు. అటువంటి అవకాశం తనకు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

హెలిప్యాడ్ పనుల పరిశీలన

శ్రీశైలం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం రానున్న నేపథ్యంలో హెలిప్యాడ్ పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీవో నాగజ్యోతి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు సున్నిపెంటలో గల హెలిప్యాడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై పలు సూచనలు చేశారు. నాలుగు నుంచి ఐదు వరకు హెలిప్యాడ్ గ్రౌండ్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. పారిశుధ్య పనుల్లో లోపాలు లేకుండా సరిచూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: మంత్రి బీసీ



బనగానపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మతల్లి ఆశీర్వదంతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈఏడాది వర్షాలు బాగా పడ్డాయని, చెరువులు కూడా నిండాయని అన్నదాతకు ఈఏడాది అంతా అనుకూలమన్నారు. దసరా పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

నిజరూప అలంకారంలో కామేశ్వరీదేవి

● అశ్వవాహనంపై ఆశీనులైన అమ్మవారు



మహానందిలో అశ్వవాహనంపై అమ్మవారి గ్రామోత్సవం



మహానంది, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభోవపేతంగా జరుగుతున్నాయి. బుధవారం పదో రోజు కామేశ్వరీదేవి నిజరూప అ లంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక యాగశాల మంటపంలో శరన్నవరాత్రి ఉభయ దాతలతో చండీ హోమంతో పాటు కుంకుమార్చన పూజలను నిర్వహించారు. సాయంత్రం అలంకార మంటపంలో భక్తుల సమక్షంలో సహస్ర దీపాలంకరణ సేవను జరిపారు. అశ్వవాహనంపై అమ్మవారు ఆశీనులయ్యారు. ఆలయ మాడవీధుల గుండా గ్రామో త్సవం జరిపారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు శమీ పూజలు: మహానంది క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో చివరిరోజు గురు వారం శమీ ఉత్సవ పూజను నిర్వహిస్తున్నట్లు ఆలయ వేదపండితులు రవి శంకర్ అవధాని తెలిపారు. ముందుగా ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహి స్తారన్నారు. అనంతరం ప్రత్యేక పల్లకిపై ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీనులు చేసి క్షేత్ర వీధుల గుండా గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఈశ్వర్‌నగర్ కాలనీ జమ్మి చెట్టు వద్ద ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి పూజలు నిర్వహిస్తారన్నారు.

సిద్ధిధాత్రి అలంకారంలో చౌడేశ్వరీదేవి



బనగానపల్లె, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): దసరా శరన్నవరాత్రి సందర్భంగా బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత బుధవారం సిద్ధిధాత్రి అలంకారంలో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డితో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మహిషాసుర మర్దినిగా సుంకులాపరమేశ్వరి దేవి





అమ్మవారిని దర్శించుకున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా సుంకులాపరమేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం మండలంలోని కె.నాగలాపురంలో అమ్మవారి ఆలయంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదోరోజు అమ్మవారు మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అమ్మవారి దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ పర్యవేక్షించారు.

అశ్వవాహన అలంకరణలో మంచాలమ్మ



మంత్రాలయం, అక్టోబరు 1(ఆంధ్ర జ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ రజిత అశ్వవాహనం దర్శనమిచ్చారు.బుధవారం నవరాత్రోత్సవాల్లో పదవ రోజు అశ్వయుజ నవమి శుభదినాన్ని పురష్కరించుకొని మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా పండితులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పసుపు,గందం, పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధరకాల పుష్పాలు, వెండి అశ్వవాహనంపై శోభాయమానంగా అలంకరించారు. మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు.



కల్లూరు అమ్మవారిశాలలో దుర్గాదేవి అలంకరణ



ఆదోనిలో నగరేశ్వర దేవాలయంలో రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

● కలెక్టర్ ఏ.సిరి



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కాలేదన్నారు. నగరంలో సుందరీకరణ, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు చేయాలని కమిషనర్ విశ్వనాథ్‌ను ఆదేశించారు. హెలిప్యాడ్‌ల నిర్మాణంపై ఆర్అండ్‌బీ ఎస్ఈతో చర్చించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు రోడ్‌షో నిర్వహణ, పార్కింగ్‌పై సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జేసీ డా.బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ దంపతులు

కర్నూలు క్రైం, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆయన సతీమణి ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ దీపికాపాటిల్ ఈ పూజలో పాల్గొన్నారు. అన్ని రకాల తుపాకులు, వాహనాలకు, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి రోజు నుంచి అందరికీ విజయం చేకూరాలని ఆకాంక్షించారు.

నిమ్మకాయపై జగన్మాత చిత్రాలు



దసరా పర్వదినం సందర్భంగా నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ నిమ్మకాయ మీద రెండు అమ్మవారి చిత్రాలు వేశారు. ఈ చిత్రంలో దుర్గాదేవి,మహిషాసురుని వధించిన తర్వాత శాంతించి చిరునవ్వు తో భక్తులకు దీవిస్తున్నట్లు, రెండో చిత్రంలో అమ్మవారిని జగన్మాత రూపంలో ఉన్నట్లు వేశారు. అమ్మవారి ఆశీస్సులు భక్తులపై ఉండాలని చిత్రకారుడు కోటేష్ ఆకాంక్షించారు.

● నంద్యాల కల్చరల్, ఆంధ్రజ్యోతి

కొనాలంటే గుడ్లు తేలెయాల్సిందే..



చికెన్, మటన్ ధరలు మండిపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కనీసం కోడి గుడ్లతోనైనా సరిపెట్టుకుందామంటే వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకప్పుడు రూ.4, 5 పలికిన గుడ్డు ధర ఇప్పుడు రిటైల్ మార్కెట్లో ఏకంగా రూ.8, 10కు చేరుకుంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఏడాది కాలంగా కోడి గుడ్ల ధరలు మండుతూనే ఉన్నాయి. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా తోపుడు బండ్లపై ఆమ్లెట్లు, న్యూడిల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వినియోగానికి తగినంత ఉత్పత్తిలేకే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రతి రోజూ లక్షకు పైగా కోడిగుడ్ల వినియోగం జరుగుతున్నట్లు వ్యాపార వర్గాల అంచనా.

● కొలిమిగుండ్ల, ఆంధ్రజ్యోతి

జయ జయహే...జగన్మాత!

- నేడు విజయదశమి



కర్నూలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్ర జ్యోతి): అఖిలాండ భక్తకోటి బ్రంహ్మాండ నాయకి, ఆది పరాశక్తి, కొలిచే వారికి కొంగు బంగారమైన దుర్గామాత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలు అందుకుంటున్న జగన్మాత వేడుకల్లో దుర్గాష్టమి పూజలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం జిల్లాలోని హైందవ భక్తులు మహార్నవమి వేడుకను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజలు నిర్వహించారు. ఆయుధ పూజల సందర్భంగా జిల్లాలోని రైస్ మిల్లులు, ఆటోమొబైల్ వర్క్‌షాపులు, ఇతర కర్మాగారాలను పూలతో అలంకరించి ఆయుధ పూజలకు సిద్ధం చేశారు. నూతనంగా కొన్న వాహనాలతోపాటు, తాము నిత్యం ఉపయోగించే వాహనాలకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దసరా వేడుకల్లో చివరి రోజున గురువారం విజయ దశమి (దసరా) పండుగను జిల్లా వాసులు అత్యంత వైభవంగా నిర్వహించుకోనున్నారు. లోకకంటకుడైన మహిషాసురుడ్ని వధించేందుకు దుర్గామాత తొమ్మిది రోజుల పాటు పోరాటం చేసి అలసినందుకు గుర్తుగా పదో రోజున పుష్పాలంకరాలతో జగజ్జననిని విశేషంగా పూజిస్తారు. జిల్లాలోని పల్లెలు దసరా మహోత్సవానికి ముస్తాబయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో దసరా వేడుకల సందడి చివరి మూడు రోజుల్లో కనిపిస్తోంది. దూర ప్రాంతాల్లో నివసించే కుటుంబ సభ్యులంతా ఇళ్లకు చేరుకోవడంతో ప్రతి ఇంట్లోనూ సందడిగా మారింది.

పత్తి రైతులకు శుభవార్త

● క్వింటం పత్తి ధర రూ.8,110



పెంచికలపాడులోని సీసీఐ కొనుగోలు కేంద్రం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేళ కూటమి ప్రభుత్వం పత్తి రైతులకు శుభవార్త అందించింది. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తికి క్వింటానికి రూ.8110లు అందేలా చర్యలు తీసుకోవాలని సీసీఐని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అన్నదాతలు పండించిన పత్తిని దళారుల జోక్యం లేకుండా వారు నేరుగా విక్రయించి లబ్ధి పొందేందుకు సీసీఐ కసరత్తు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచడంతో కపాస్ కిసాన్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. ఈనెల మొదటి వారంలో పత్తి సేకరణ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులొచ్చాయి

అక్టోబరు నుంచి రైతుల ద్వారా సీసీఐ పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి ఎలాంటి అక్రమాలు, పొరపాట్లు జరగకుండా సీసీఐ కేంద్రాలకే రైతులు పత్తిని తీసుకెళ్లి నేరుగా అమ్ము కునేందుకు కేంద్రం కపాస్ కిసాన్ యాప్‌ను అమలులోకి తెచ్చింది. పత్తి పండించిన రైతులందరూ ఇప్పటి నుంచే ఈయాప్‌లో తమ పొలంతో పాటు బ్యాంకు వివరాలను నమోదు చేసుకోవాలి.

● నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు

దసరా వేడుకల్లో సమైఖ్యత అభినందనీయం



టీజీ వెంకటేశ్‌కు స్వాగతం పలుకుతున్న రాజస్థాన్‌వాసులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ తరహాలో దసరా ఉత్సవాల్లో సమైఖ్యత చాటడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం చిదంబరరావు వీధిలో రాజస్థాన్ విష్ణు సమాజ్ సంఘ్ ఏర్పాటు చేసిన దాండియా నృత్యంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులు టీజీని రాజస్థాన్ తరహాలో సన్మానించారు.

పొట్టి శ్రీరాములు త్యాగంతోనే రాష్ట్రావతరణ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు త్యాగనిరతితోనే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం మద్దూరునగర్ పింగళి సూరన తెలుగు తోటలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. భాషా ప్రయుక్త ప్రాతిపదికన తెలుగువారికోసం ప్రత్యేక రాష్ట్ర సాధనకు 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారన్నారు. అనంతరం మన రాష్ట్రం రెండు ముక్కలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన మలిపెద్ది నాగేశ్వరరావును, తెలుగు బాషా వికాస ఉద్యమం నేతలు కేసీ కల్కూరా, జేఎస్సార్ కే.శర్మను సన్మానించారు. కేవీ సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, కాపునాడు అధ్యక్షుడు ఆర్జ రామకృష్ణ, ఆవోపా అధ్యక్షుడు డా.పి.లక్ష్మినారాయణ, డా.దండబోయిన పార్వతి పాల్గొన్నారు.

డోన్ ఎమ్మెల్యే కోట్ల పూజలు

కోడుమూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి వల్లెలాంబదేవి ఆయలంలో పూజలు చేశారు. పల్లకీ సేవలో పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కోట్ల కవితమ్మ, కోట్ల కౌశిక్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న, మాజీ సర్పంచు రాంబాబు, హేమాద్రిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి భరత్



కర్నూలు అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి మంత్రి టీజీ భరత్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలు, సిరి సంపదలతో తులతూగాలని, విజయాలు సిద్ధించాలని, రాష్ట్రం, జిల్లాసుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

పని చేస్తేనే పైసలు



ఉపాధి హామీ పథకం అవినీతికి కేరాఫ్‌గా ఉండేది. సోషల్ ఆడిట్‌లో ఇదే విషయం పలుమార్లు స్పష్టమైంది. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకంలో మస్టర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేయడంతో పాటు అవినీతి అక్రమారులను గుర్తించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ చేసి పనులకు హాజరయ్యే వారికి వేతనం అందేలా ప్రత్యేక విధానాన్ని అమలుచేస్తోంది.

- ‘ఉపాధి’లో అవినీతికి చెక్
- శ్రామికులకూ ఈకేవైసీ విధానం అమలు
- రెండు సార్లు ముఖ హాజరు
- బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట

నంద్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో పని చేసే శ్రామికులకు ఇక నుంచి పనిచేస్తే పైసలు అందుతాయి. బోగస్ శ్రామికులు లేకుండా పనిచేసే సమయంలో ఆయా శ్రామికులకు రెండుసార్లు ముఖ హాజరు కూడా తీసే విధంగా ప్రణాళిక రచించింది. తద్వారా ఎప్పటికప్పుడు ఆయా పనులకు హాజరయ్యే వారికి మాత్రమే వేతనం అందనుంది. ఇదేతరుణంలో బోగస్ శ్రామికులకు ఇక చెక్ పెట్టినట్లైంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. గతంలో మాదిరిగా కాకుండా ఉపాధిలో పని చేస్తేనేవేతనం అన్నట్లైంది. ఏది ఏమైనా ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో అవినీతి అక్రమార్కులకు ఝులక్ ఇచ్చినట్లైంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ఇప్పటికే ప్రభుత్వం నుంచి జిల్లా డ్వామా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో ఆశాఖ అధికార మంత్రాంగం సైతం అప్రమత్తమై ఆయా పనుల్లో నిమగ్నమ య్యారు. జిల్లాలో ప్రస్తుతం యాక్టివ్‌లో ఉన్న 2,15,000 జాబ్‌కార్డుల పరంగా.. 3,82,000 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఇప్పటికి జిల్లాలో 1,100మందికి పూర్తి చేశారు. మిగిలిన వారందరికీ కూడా అక్టోబరు నెలలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

ప్రతి నాలుగు గంటలకు ఒక సారి

ఉపాధిలో పనుల ఎంపిక నుంచి ఆయా పనులు పూర్తయ్యే వరకు ఆశాఖ అధి కారులు పకడ్బందీగా చర్యలు తీసుకోనున్నారు. పనికి వచ్చే వారికి జాబ్‌కార్డు ఆధా రంగా ఆయా శ్రామికులకు సంబంధించి ఈకేవైసీ చేయడం, పని చేసే సమయాల్లో ప్రతి నాలుగు గంటల వ్యత్యాసంతో రెండు ముఖ హాజరు(ఫేస్ బయోమెట్రిక్) వేయించడం జరుగుతుంది. ఆయా సమయాల్లో ఎవరైనా ఒకరికి బదులు మరొకరు వేసే ప్రయత్నం చేసి పనిచేసినట్లు చూపితే వారికి ఎలాంటి వేతనం రాదు. శ్రామికుల జాబ్ కార్డు ఆధారంగా ఆయా వారి ఆధార్ అనుసంధానం కూడా చేస్తారు. మొత్తంగా భవిష్యత్‌లో ఉపాధిలో బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడినట్లైంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

● జిల్లాలో జాబ్ కార్డులు	: 2,67,000
● ఉపాధిలో పని చేస్తున్న శ్రామికులు	: 5,01,000మంది
● యాక్టివ్ జాబ్ కార్డులు	: 2,15,000
● పనికి వస్తున్న శ్రామికుల సంఖ్య	: 3,82,000 మంది
● ఈకేవైసీ చేయాల్సినవి	: 3,82,000
● ఈకేవైసీ పూర్తయినవి	: 1,100 మంది

ఈకేవైసీ వేగవంతం చేస్తాం



ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ విధానం అక్టోబరు నెలలో పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నాం. పని చేసే సమయాల్లో రెండు సార్లు ముఖ హాజరు చేయాల్సి ఉంది. తద్వారా భవిష్యత్తులో అక్రమంగా వేతనం పొందే అవకాశం లేదు. శ్రామికులు కూడా ఈ విషయాన్ని గ్రహించాలి.

● సూర్యనారాయణ,పీడీ, డ్వామా, నంద్యాల

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలి

శ్రీశైలం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మల్లన్న ఆశీస్సులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వేడుకున్నారు. బుధవారం దసరా ఉత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సరమ్పించేందుకు మంత్రి శ్రీశైలం చేరుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు వచ్చానన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి అమ్మవారి దీవెనలు, స్వామి వారి రక్ష ఉండాని కోరుకున్నట్లు తెలిపారు. శ్రీశైలం అభివృద్ధికి అనేక ప్లాన్లు ఉన్నాయని, వాటిని అమలు చేయాలంటే దేవదాయశాఖకు ఉన్న భూమి అంతా క్షేత్రానికి దక్కాలన్నారు. 16న ప్రధాని శ్రీశైలంకు వస్తున్నారని, భూమి ప్రస్తావన కూడా తీసుకొని వచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్‌లాల్, శ్రీశైలం దేవస్థాన చైర్మన్ రమేష్‌నాయుడు, కలెక్టర్, ఎస్పీ, ఈవో పాల్గొన్నారు.



శ్రీశైలంలో మంత్రి ఆనం

జీవో 99 రద్దుచేయాలి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులకు సంబంధించి జీవో 99ని రద్దు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యులు ధర్నా చేశారు. డిపార్ట్‌మెంట్‌లో క్లినికల్ 30శాతం, నాన్ క్లినికల్ 50శాతం ఇన్‌సర్వీస్ సీట్లను కల్పించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు గత 20నుంచి 25సంవత్సరాలుగా మొదటి ప్రమోషన్‌కు కూడా నోచుకోలేదన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న చంద్రన్న సంచార చికిత్సా అలవెన్స్ రూ.4,500లను తక్షణమే అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్చంద్రారెడ్డి, కాంతారావునాయక్, రూపేంద్రనాథ్‌రెడ్డితో పాటు జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవానికి 700 మంది పోలీసులు

- 340 రింగుల కర్రలు సీజ్
- 200 మంది ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేశాం
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా శుక్రవారం దేవరగట్టులో జరిగే మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం బన్ని ఉత్సవాల్లో పోలీసులు తీసుకుంటున్న చర్యలపై ఆయన వివరాలు వెల్లడించారు. కలెక్టర్‌తో కలిసి రెండు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించామని, ఒకటి కర్నూలు కలెక్టరేట్‌లో, మరొకటి దేవరగట్టులో నిర్వహించామని తెలిపారు. బన్ని ఉత్సవానికి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. 110 సీసీ కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే సీసీ కెమెరాకలు ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 20 బెడ్లతో ఒక తాత్కాలిక ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవంలో ఎవరైనా గాయాలపాలైతే వారి కోసం 104, 108 అంబులెన్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో 15 రోజుల నుంచి గ్రామాల ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. ఉత్సవంలో 1.5 లక్షల మంది ప్రజలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 200 మంది ట్రబుల్ మాంగర్స్‌ను, నాటుసారా అమ్మే వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో నాటుసారాతో పాటు 340 రింగుల కర్రలు సీజ్ చేశామన్నారు. దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు, 10 పికెట్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించామని తెలిపారు. ఈ ఉత్సవాలకు ఇద్దరు ఏఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 700 మది పోలీసులతో పటిష్ట భద్రతను కల్పించామని తెలిపారు. చిన్న పిల్లలు, తల్లి దండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దు

- మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి

మంత్రాలయం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు వివిధ పేర్లతో నకిలీ వెబ్‌సైట్లను నమ్మి గదులను బుక్ చేసుకోవద్దని మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి అన్నారు. బుధవారం బెంగుళూరుకు చెందిన నివేదిత అనే భక్తురాలు సుజీంద్ర గెస్టుహౌస్ పేరుతో రూ.4వేలు చెల్లించి మోసపోయామని మఠం మేనేజర్ వెంకటేశ్ జోషికి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా మేనేజర్లు మాట్లాడుతూ వీవీజీ పేరుతో రూ.3వేలు, మరో భక్తుడు రూ.2వేలు నకిలి వెబ్‌సైట్లకు చెల్లించి మోసపోయారని తెలిపారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వెబ్‌సైట్ తప్ప మరో వెబ్‌సైట్‌లో రూముల కోసం మఠం వారు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. రెండు నెలలుగా సుజీంద్ర, ఈఈజీ, విజయ్ విఠల్, భీరేంద్ర, వసతి గృహాల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి డబ్బులు వసూలు చేస్తున్నారని, భక్తులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి పైసాకు శ్రీమఠం రసీదు చెల్లిస్తుందని, ఇది భక్తులు గమనించాలని కోరారు. సీఆర్వో ఐపీ నరసింహమూర్తి, విజయేంద్రాచార్, బద్రినాథ్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో రగడ

మహానంది, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురంలో పింఛన్ల పంపిణీలో బుధవారం తెలుగు తమ్ముళ్ల మధ్య రగడ జరిగింది. గ్రామంలో అధికారులు పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు పంచాయతీ కార్యాలయం ముందు బాహాబాహీగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈఘటనను చూసిన గ్రామస్థులు భయాందోళన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక బుక్కాపురంలో తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గపోరు ఏర్పడింది. ఆధిపత్య పోరు వల్లే ఈ దాడులు జరిగాయని గుసగుసలు వినిపిస్తు న్నాయి. చివరకు ఇరువర్గాల మధ్య సఖ్యత చేసినట్లు సమాచారం. ఈవిషయంపై ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా బుక్కాపురం దాడులపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉయ్యాలవాడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం ఓవృద్ధురాలు మృతిచెందినట్లు ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని కొండుపల్లెకి చెందిన నారాయణమ్మ(55) భర్త శివశంకర్‌రెడ్డి ఆడపిల్లల బంగారు తాకట్టు పెట్టి అప్పులు చేశాడు. దీంతో మనస్థాపానికి గురైన నారాయణమ్మ మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పా డింది. కుటుంబీకులు గమనించి హుటాహుటిన నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

	2021 వరకు	2021 నుండి 2025	పెరుగుదల
1. వార్షిక ఆదాయం	180 కోట్లు	310 కోట్లు (2024-2025 వార్షిక సంవత్సరానికి)	80% శాతము పెరుగుదల
2. పాలు, పాల పదార్థములు అమ్మకము రోజునకు (సగటున)	80 వేల లీటర్లు రోజునకు	1,20,000 లీటర్లు (రోజుకు)	25% పెరుగుదల
3. పాల సేకరణకు రోజునకు (సగటున)	50 వేలు	1,30,000 లీటర్లు (రోజుకు)	130% పెరుగుదల
4. మూలధన పెట్టుబడి (యంత్రములు/బిల్డింగ్ తదితరములు ఆధునీకరణ కొరకు వెచ్చించడమైనది.)	1.40 కోట్లు ప్రతి సంవత్సరము (సగటున)	36 కోట్ల రూపాయలు ఆరంభం నుంచి రెండు దశబ్దాలుగా ఎటువంటి ఆధునికీకరణకు, సామర్థ్యంనకు మెరుగుదలకు నోచుకొని యంత్రములు, భవనములు, వాటి మరమ్మతులకు వెచ్చించబడినది.	ప్రతి సం॥ సగటున 9 కోట్లు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని కార్పొరేట్ డైరీలకు ధీటుగా ఉత్పత్తుల యొక్క నాణ్యత మెరుగుపరచుకోవడం పాడయిన యంత్రముల వలన ఉత్పత్తికలుగు వ్యయాలను అరికట్టి కార్మిక భద్రత పెరుగుదల.
5. పాడి రైతులకు చెల్లించిన బోనసు	1990 నుండి 2021 వరకు ఏవిధమైన చెల్లింపులు లేవు.	17 కోట్ల రూపాయలు (నాలుగు సంవత్సరాలు చెల్లించడమైనది)	ప్రతి సం॥ సగటున పాడిరైతులకు 4.2 కోట్లు బోనసు చెల్లింపు
6. ఉద్యోగులు/కార్మికులకు బోనసు చెల్లింపులు	1990 నుండి 2021 ఏవిధమైన చెల్లింపులు లేవు.	3 కోట్లు 50 లక్షలు (నాలుగు సంవత్సరములు చెల్లించడమైనది)	ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్ పెరుగుదల ఉద్యోగులకు సగటున 8% నుండి 10% జీతం పెరుగుదల. వారికి బోనసు సంవత్సరానికి 80 లక్షలు
7. పాడి రైతులకు గేదెల కొనుగోలుకు 20% రాయితీ చెల్లించుట	అమలుపరచ లేదు	1 కోటి 10 లక్షలు నాలుగు సంవత్సరములు చెల్లించడమైనది.	సగటున సంవత్సరానికి 30% పాల ఉత్పత్తి పెరుగుదల.
8. క్షీరబంధు పథకము క్రింద మరణించిన పాడిరైతుల కుటుంబమునకు ఆసరాగా చెల్లించుట.	అమలుపరచలేదు	15 లక్షలు చెల్లించడమైనది.	మరణించిన పాల ఉత్పత్తి దారుల గౌరవార్థం చిరు నివాళి.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వృద్ధులపై సానుభూతి అవసరం: ఎంపీ



వృద్ధులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు సానుభూతి, సహకారం అవసరమని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని సందర్భంగా అయ్యలూరు నవజీవన్ స్కూల్‌లో అలిమ్కో ఆధ్వర్యంలో వృద్ధులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

స్మార్టు రేషన్ కార్డుల పంపిణీ

మిడుతూరు: మండలంలోని పీరుసాహేబ్ పేట గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర రెడ్డి, టీడీపీ నాయకులు చిన్న బద్రారెడ్డి, పెద్ద బద్రా రెడ్డి, తువ్వా భగీరథ రెడ్డి, స్వామి రెడ్డి, సీతారామి రెడ్డి, అంకి రెడ్డి, వెంకట రామి రెడ్డి, జీవరత్నం పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

నందికొట్కూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హామీ ఇచ్చారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో రబ్బాని కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యేను రైతులు కలిశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పొలాలను పరిశీలించారని వారు ఇచ్చే నివేదికల ఆధారంగా రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమం లో బిజిన వేముల రైతులు హుస్సేన్ మియా, శివలింగం, శేఖర్, మహ బూబ్ బాషా, జయరాం, సుంకన్న, లక్ష్మన్న, నాయకులు పాల్గొన్నారు.

మహాకాళి అలంకరణలో అమ్మవారు

- కొనసాగుతున్న శరన్నవరాత్రి వేడుకలు
- పూజలు చేసిన భక్తులు

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహాకాళి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మహిషాసుర మర్దినిగా, మహాలక్ష్మీదేవిగా, కనకదుర్గాదేవిగా అమ్మవారిని ప్రత్యేక అలంకణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



నంద్యాల కల్చరల్: పట్టణంలోని ఆయా ఆలయాల్లో కాత్యాయనీ దేవీ, మహిషాసుర మర్దిని, మంగళగౌరీదేవి, కాళీమాత అమ్మవార్లుగా దర్శనం



నంద్యాల నూనెపల్లె అమ్మవారిశాలలో మహిషాసుర మర్దిని అలంకారంలో వాసవీ మాత



జూపాడుబంగ్లాలో.. | నందికొట్కూరులో.. | పాములపాడులో.. | పాణ్యంలో.. | బండిఆత్మకూరులో.. | ఆత్మకూరులో.. | కొత్తపల్లిలో..

లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం : మంత్రి

నంద్యాల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ అందుకుంటున్నప్పుడు లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపించిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల పట్టణం 19వ వార్డు పొన్నాపురం కాలనీలో ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జీ షేక్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో మంత్రి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంటుపల్లి హరిబాబు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దస్తగిరి, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్



సుండిపెంటలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

పట్టణంలోని ఎన్టీఆర్ షాదీఖానాలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, కమిషనర్ బండి శేషన్న, అధికారులు పాల్గొన్నారు.

సుండిపెంటలో..

శ్రీశైలం: మండలంలోని సుండిపెంట గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే వ్యాపారస్తులకు జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలు అందజేశారు. అనంతరం స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, పంచాయతీ అధికారి బాలునాయక్, టీడీపీ మండల ఇన్‌చార్జీ యుగంధర్‌రెడ్డి, ఆధ్యక్షప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాగేళ్ల సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జవాన్ మృతి

పగిడ్యాల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ తిక్కస్వామి (34) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం గ్రామస్థుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన బలరాముడు, గంగమ్మల కుమారుడు తిక్కస్వామి ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ అందులో భాగంగానే ఢిల్లీకి వచ్చారు. అనార్యోగానికి గురి కావడంతో ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సుభాషిణి, ఇద్దరు కుమారు లు ఉన్నారు. గురువారం తిక్కస్వామి పార్థివదేహం పగిడ్యాలకు తీసుకరానున్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు



లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : హిందువులకు దసరా ముఖ్యమైన పండుగని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ బుధవారం అన్నారు. భక్తిశ్రద్ధలతో దుర్గా మాతకు తొమ్మిది రోజులు పూజలు చేసి పదో రోజు విజయదశమి అంగరంగ వైభవంగా జరుపుకుంటారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రశాంతంగా చేసుకోవాలని సూచించారు.

గాంధీ జయంతి వేడుకలు నిర్వహించండి

నంద్యాల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సచివాలయాలలో గురువారం గాంధీ జయంతి వేడుకలకు నిర్వహించాలని ఎంపీడీవో సుగుణశ్రీ ఆదేశించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకల్లో మండల పరిషత్, ఉపాధి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

నంద్యాల ఆర్టీసీ డీఎంగా జంకుల మాధవి

నంద్యాల టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జంకుల మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన గంగాధర్‌రావు పదోన్నతిపై వైజాగ్ డిప్యూటీ సీఎంఈగా వెళ్లారు. ఆయన స్థానంలో విజయవాడ హెడ్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న జంకుల మాధవి నంద్యాల డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నంద్యాల హస్పిటల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ అన్నారు. బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి డెమో రవీంద్రనాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురప్ప, లక్ష్మీనారాయణ, సిబ్బంది శివరాం, నర్సప్ప, జగదీష్, హరినాథరెడ్డి, గఫార్, వంశీ, సంటెన్న పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్వయం సేవకుల ర్యాలీ

శ్రీశైలం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అవతరించి వంద సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బుధవారం స్వయం సేవకులు యూనిఫాం ధరించి శ్రీశైలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త వెంకటేశ్వరరావు, రామకృష్ణ స్వయం సేవక్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.

రీసర్వేకు ప్రజలు సహకరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుకుంద గ్రామంలో ఈ నెల 3 నుంచి జరగనున్న రీసర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రత్నరాధిక కోరారు. బుధవారం గ్రామంలో రీసర్వేకు సంబంధించి గ్రామ సచివాలయంలో గ్రామసభను నిర్వహించారు. సమావేశంలో రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు: జేసీ

నంద్యాల నూనెపల్లి/హస్పిటల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్, ట్రాక్టర్ పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, బయోపెస్టిసైడ్స్, స్ప్రింక్లర్, డ్రిప్ పరికరాలు, డీజిల్ ఇంజిన్‌లపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. బుధవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ ముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు, నంద్యాల మండల వ్యవసాయ అధికారులు ప్రసాద్‌రావు, ఆయుబ్‌బాషా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందికొట్కూరు:

జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు ఆర్థికంగా కలిసి వచ్చిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలో పలు దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీపై ఆరా దీశారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఏర్పాటుకు పెద్దన్న పాత్ర పోషించాం'

నంద్యాల రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బలిజలు పెద్దన్న పాత్ర పోషించారని బలిజ సంఘ నాయకులు శెట్టి విజయకుమార్, కోనేటి చంద్రబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రథమనందీశ్వర దేవాలయ ఆవరణలో బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

కొత్తపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తక్ అహ్మద్ మౌలానా ముస్తక్ అహ్మద్ అన్నారు. బుధవారం ముసలిమడుగు గ్రామంలో ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గింపుపై ఆయన అవగాహన కల్పించారు.

పారదర్శక పాలనే ధ్యేయం: ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, సొసైటీ ఛైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, గిరీశ్వరరెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పెద్దన్న, రవి కుమార్ యాదవ్, సుధాకర్, ప్రసన్నరెడ్డి, దేవసహాయం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, డీటీలు సత్యదీప్, నాగన్న పాల్గొన్నారు.



జూపాడుబంగ్లా: స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

ఎర్రగూడూరు గ్రామంలో..

పాములపాడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలోనే అందించి వారి జీవితాల్లో సంతోషాలను నింపిన ఘనత ఒక్క టీడీపీ కే దక్కిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగూడూరులో స్థానిక టీడీపీ సీనియర్ నాయకు లు చెల్లె హరినాథ్‌రెడ్డి, శంకర్‌స్వామితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక సచివాలయంలో తహసీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగమ్మబాయి, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, సొసైటీ ఛైర్మన్ గోవిందు, పాల్గొన్నారు.

పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో..

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులను పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరాముడు, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్ర కుమార్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, పలుచాని రాజశేఖర్ రెడ్డి, వాసురెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కోట్ల దంపతులు

బేతంచెర్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఉప కమిషనర్ రామాంజనేయులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి శాలువ కప్పి సన్మానించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, వేద పండితులు జ్వాలా చక్రవర్తి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులు, బేతంచెర్ల టీడీపీ ఇన్‌చార్జి వర్దన్ రెడ్డి, కౌన్సిలర్ అంజి, మేకల నాగరాజు, రూబెన్ పాల్గొన్నారు.

ప్రజలపై తగ్గిన భారం: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్లును తగ్గించి ప్రజలకు ఎంతో మేలు చేశారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించారన్నారు. నిత్యావసర సరుకులు, ఎలక్ట్రికల్, హెల్త్ తదితర వాటిపై రేట్లు తగ్గాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, ముబారక్, షరీఫ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం: ఆళ్లగడ్డలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకొన్న ఎమ్మెల్యేకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి పూజల అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

తగ్గించిన జీఎస్టీ రేట్లకే సరుకులు అమ్మాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహసీల్దారు తదితరులు

కోవెలకుంట్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం తగ్గించిన జీఎస్టీ రేట్లకే డీలర్లు పరికరాలను రైతులకు అమ్మాలని కోవెలకుంట్ల ఎంపీడీవో వర ప్రసా దరావు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద తగ్గిన జీఎస్టీ రేట్లపై అన్ని శాఖల అధికారులతో కలిసి పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మూడో రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ట్రాక్టర్లు, టైర్లు, బిందు సేద్యం పరికరాలు, బయోపెస్టిసైడ్ వంటివాటిపై జీఎస్టీ తగ్గించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు, ఏవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌక దుకాణాల పరిశీలన

రుద్రవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు, నరసాపురం, రుద్రవరంలో చౌక దుకాణాలను బుధవారం తహసీల్దారు ఆల్‌ఫ్రెడ్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చౌక దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, వీఆర్వోలు ఉన్నారు.

జీవో 5 రద్దు చేయాలి

చాగలమర్రి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బలిజలకు వ్యతిరేకంగా జారీ చేసిన జీవో నంబర్ 5ను ప్రభుత్వం రద్దు చేయాలని సంఘం నాయకులు గుత్తి నరసింహులు, ఆవుల ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ జీవో 5కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అబ్దుల్ సత్తార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంబాపురం, రంగాపురం గ్రామాలతో పాటు బేతంచెర్ల పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ, ప్రభుత్వ చౌక దుకాణాల్లో రేషన్‌కార్డుదారులకు స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పంపిణీ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వస్తువులపై వసూలు చేసే జీఎస్టీ తగ్గింపుపై ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బేతంచెర్ల పట్టణంలోని దుర్గమ్మ ఆలయం ఎదుట నగర కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ డీవో ఫజిల్ రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదల మోములో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఆయన సామాజిక భద్రతా పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, తహసీల్దార్ భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, ఖాజాపీర్, శ్రీకాంత్, రాజశేఖర్, తిమ్మారెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

ఒకటో తేదీ వచ్చిందంటే పండుగే

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ: ప్రతి నెల ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్లు అందుతుండటంతో గ్రామాల్లో పండుగ వాతావారణం నెలకొందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందన్నారు. ఆళ్లగడ్డ ప్రాంత రైతులకు గత ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఏం చేశారో తెలపాలని ఆమె ప్రశ్నించారు.

సమావేశంలో కౌన్సిలర్ హుసేన్‌బాషా, టీడీపీ నాయకులు జాఫర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఆనంద్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ప్రత్యేక అధికారి హరిగోపాల్, ఎంపీడీవో నూర్జహాన్ పాల్గొన్నారు.

చాగలమర్రి: పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ముత్యాల పాడు గ్రామంలో ఆయన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. అలాగే పెద్దబోదనం గ్రామంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డెయిరీ చైర్మన్ రమణారెడ్డి, టీడీపీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్య మని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఎద్దుపెంట, మిద్దెపల్లె గ్రామాల్లో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి మిద్దెపల్లె గోవిందు, ఎద్దుపెంట మాజీ సర్పంచ్, యూనిట్ ఇన్‌చార్జి ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు మల్లేశ్వరయ్య, రవి పాల్గొన్నారు.

డోన్ రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.4వేల పింఛన్‌ను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. బుధవారం వెంకటనాయునిపల్లె గ్రామంలో లబ్ధిదారులకు సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్టారెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేట వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన లబ్ధిదారులకు పింఛను అందించారు.

రుద్రవరం: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పండుగలా పంపిణీ బుధవారం కొనసాగిందని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం అన్నారు. రుద్రవరంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 6,161 పింఛన్లకు గాను 5,840 పింఛన్లు పంపిణీ చేశామన్నారు.


రంగాపురంలో దివ్యాంగురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల


ఆళ్లగడ్డలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


ముత్యాలపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి

బనగానపల్లె: నిరుపేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని బనగానపల్లె పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు.

కూలిన మట్టిమిద్దెల పరిశీలన


ముత్యాలపాడులో కూలిన మట్టిమిద్దెలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

చాగలమర్రి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ముత్యాలపాడు, గొడి గనూరు, రాంపల్లె గ్రామాల్లో భారీ వర్షాలతో కూలిన మట్టిమిద్దెలను హౌసింగ్ పీడీ హరిగోపాల్, ఆళ్లగడ్డ హౌసింగ్ డీఈ విజయ్‌బాబులు బుధవారం పరిశీలించారు. బాధితులకు జరిగిన నష్టంపై అడిగి తెలుసుకున్నారు. కొత్తగా గృహాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ నవీన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సుబ్బ రామయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

వన్యప్రాణుల జోలికి వెళితే.. జైలుకే

రుద్రవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల జోలికి వెళితే జైలుకు వెళ్లక తప్పదని ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చెలిమ రేంజ్ పరిధిలోని రుద్రవరం మండలంలోని పెద్దకంబలూరు, డి.కొట్టాల, యల్లావత్తుల, శ్రీరంగాపురం, కోటకొండ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. వన్య ప్రాణి చట్టం 1972 ప్రకారం వన్యప్రాణికి హానీ కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటవీ సంపద తరలిపోకుండా ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రామారావు, నాగప్ప , సెక్షన్ ఆఫీసరు విజయవర్ధన్ పాల్గొన్నారు.

బెస్తల అభివృద్ధికి కృషి చేస్తా

డోన్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బెస్తల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రజా వైద్యశాలలో నూతనంగా ఎంపికైన బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల మల్లికార్జునను రమేష్, గంగిరెడ్డి, మున్సిపల్ వలి, హిట్లర్, బాబు, మోహనాచారి, టైలర్ మనోహర్, హరూన్ కుమార్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువలు, పూలమాలలతో సత్కరించారు. మల్లికార్జున మాట్లాడుతూ బెస్త కులస్థులు ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తానన్నారు.

వేతనాల సలహా మండలి డైరెక్టర్‌కు అభినందన

శిరివెళ్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి రాష్ట్ర వేతనాల సలహా మండలి డైరెక్టర్ పదవి లభించడంతో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం అభినందనలు తెలియజేశారు. శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామంలోని శ్రీకాంత్‌రెడ్డి స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. భూమా కుటుంబానికి అత్యంత సన్నిహి తుడైన కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి దక్కడంతో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ధ్యేయం

శిరివెళ్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని డీసీటీవో సునీతారెడ్డి అన్నారు. శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలో జీఎస్టీ 2.0 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులు వినియోగించే ట్రాక్టర్లు, యంత్ర పరికరాలపై జీఎస్టీ గణనీయంగా తగ్గిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ విజయ శేఖర్, శిరివెళ్ల ఏవో సుధాకర్, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, మాజీ జడ్పీటీసీ యామా గురప్ప, టీడీపీ నాయకులు బాలచంద్రుడు, ఉల్లి వెంకట సుబ్బయ్య, పసుల రామ కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన పెంచుకోవాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నివా రణపై అవగాహన పెంచుకోవాలని కోవెలకుంట్ల ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంటు సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ వ్యానుపై ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు.

పింఛన్ల కోసం పడిగాపులు


సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

ప్రతి నెలా 1వ తేదీన ఉదయాన్నే ఇంటి వద్దకే పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అధికారుల అలసత్వం.. సిబ్బంది నిర్లక్ష్యం.. వెరసి లబ్ధిదారులకు పాట్లు తప్పడం లేదు. బుధవారం మండలంలోని పేట్నికోట గ్రామంలో ఉదయం తొమ్మిది గంటలు దాటినా పింఛన్ ఇవ్వలేదు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయం వద్దకు చేరుకున్నారు. పింఛన్లు ఎప్పుడు ఇస్తారో అంటూ వేచి చూశారు. లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేయాల్సివుండగా, నడవలేని వృద్ధులు సైతం సచివాలయం వద్దకు చేరుకోవడం గమనార్హం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకనే కింది స్థాయి సిబ్బంది ఇలా ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

● కొలిమిగుండ్ల, ఆంధ్రజ్యోతి



తాళం వేసి ఉన్న సచివాలయం

పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ


డోన్: ఆయుధ పూజలో పాల్గొన్న డీఎస్పీ

డోన్ రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఆయుధ పూజలో డీఎస్పీ వి.శ్రీనివాసులు పాల్గొని దుర్గామాత చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మమత, పోలీసులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రమైన కొలిమిగుండ్ల యూపీఎస్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మద్దినేని రమేషబాబు ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు గోవిందనాయక్, బాబాఫకృద్దీన్, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కన్సల్టెంట్ శివశంకర్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ముత్యాలపాడు గ్రామంలో స్వస్థ్ నారీ స్వశక్త్‌పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గ్రామ మాజీ సర్పంచ్ ఇండ్ల లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి ప్రారంభించారు. మహిళలకు బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, సీహెచ్‌వో మనిషా, ఏఎన్ఎం సుభాషిణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం: మహిళ ఆరోగ్యం కుటుంబానికి పునాది అని వైద్యురాలు భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ముత్తలూరు, చిత్తరేణిపల్లెలో స్వస్తినారీ, స్వస్తి పరివార్ అభియాన్ పథకం కింద వైద్యశిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటరు రత్నాలు, సూపర్‌వైజర్లు రసూల్, సీహెచ్‌వోలు సుస్మిత రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

దొర్నిపాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లకు బుధవారం అంకాలమ్మ గుడి ఆవరణలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా తోట నాగేష్, జి.రమేష్, నొస్సుం కరిష్మా, మౌనిక, పగడాల ధరణి, అలాగే ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా షేక్.మహబూబ్ సుభహాన్, అక్తార్ అమీర్ బాషా, సివిల్ కానిస్టేబుల్‌గా పగడాల సురేష్‌లను సింగిల్‌విండో ప్రెసిడెంట్ సిద్ధి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, శ్రీపతి ప్రసాద్, తోట సంజీవ, శ్రీనివాసులు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

ఆలయాభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి బుధవారం దాతలు రూ.50వేలు విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీపీ.కుమార్‌రెడ్డి, సిబ్బంది చేతుల మీదుగా అందించారు. నందవరానికి చెందిన బాణా లక్ష్మీసాగర్‌రెడ్డి, శారద కుటుంబ సభ్యులు రూ50వేలు విరాళం అందించారు.

రాయల శతక పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న చక్రవర్తి, సంజీవ రాయుడు, రఘునాథశర్మ

డోన్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోసానిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పని చేస్తున్న డా.అనుగోల సంజీవ రాయుడు ఆధ్వర్యంలో రాయల శతక పుస్తకాన్ని ఎస్‌సీహెచ్ చక్రవర్తి, చలక్ రఘునాథశర్మ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కడిమిల్ల వరప్రసాద్, సూరం శ్రీనివాసులు, గాడిపల్లి అపర్ణ, భావన ప్రియ పాల్గొన్నారు.

గుండెపోటుతో వాల్మీకి నాయకుడి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వాల్మీకి నాయకుడు బోయ వెంకటేశ్వర్లు (70) గుండెపోటుతో మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బోయ వెంకటేశ్వర్లు వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షుడుగా పదేళ్లు పనిచేశారని, సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. మంగళవారం రాత్రి నిద్రిస్తుండగా ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈవిషయం తెలుసుకున్న వాల్మీకి, ప్రజాసంఘాల నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె, డోన్, ఆళగడ్డ నియోజకవర్గాల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పదో రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


శిరివెళ్లలో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు




డోన్, ప్యాపిలి, కనకాద్రిపల్లెలో మహిషా సురమర్దిని అలకారంలో అమ్మవారు






ఉయ్యాలవాడలో.. ఆళ్లగడ్డ, దొర్నిపాడులో దుర్గాదేవిగా..ముత్యాలపాడులో ధనలక్ష్మీదేవిగా..రుద్రవరంలో వాసవీమాతగా..


తిమ్మనాయినిపేటలో కన్యాకుమారిగా..


అవుకులో మంగళగౌరిదేవిగా..


బనగానపల్లెలో రాజరాజేశ్వరీదేవిగా..


కోవెలకుంట్లలో కంచి కామాక్షిదేవిగా..